



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్న ఆశా వర్కర్స్



అన్నమయ్య జిల్లాలోని ఉపాధి కూలీలకు అదనపు ఉపాధి అంతంత మాత్రమే లభించనుంది. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 19 మండలాలు తీవ్రమైన కరువు బారిన పడిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం కరువు మండలాల ప్రజలను ఆదుకోవడంలో భాగంగా ఉపాధి హామీ పనుల సంఖ్యను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని కోరుతూ కేంద్రాన్ని సంప్రదించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం 50 రోజుల అదనపు పనిదినాలను కల్పించేందుకు తాజాగా అనుమతించింది. జిల్లాలో 100 రోజులు పనిదినాలను పూర్తి చేసిన 9,647 మందిలో 5,067 కార్డుదారులకు అదనపు 50 రోజుల ఉపాధి పనుల కల్పనకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగిస్తోంది.

అదనపు 'ఉపాధి' అరకొరే!

అన్నమయ్య జిల్లాలో 5,067 మందికే!
50 రోజులపాటు అదనపు ఉపాధి
19 కరువు మండలాల కూలీలకు లబ్ధి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లాలో 2.50 లక్షల జాబ్‌కార్డుదారులు, 4.19 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 75 లక్షల ఉపాధి హామీ పనిదినాలను కల్పించారు. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 15 మండలాల పరిధిలో 1,37,140 లక్షల జాబ్‌కార్డుదారులు ఉన్నారు. 1,23,612 లక్షల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల ున్నాయి. ఆయా అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలోని బి.కొత్తకోట, చిన్నమండెం, గాలివీడు, గుర్రంకొండ, కలకడ, కలికిరి, కురబలకోట, లక్కిరెడ్డిపల్లి, నిమ్మనపల్లి, పెద్దతిప్పసముద్రం, పీలేరు, రామాపురం, రాయచోటి, సంబేపల్లి, సుండుపల్లి, తంబళ్లపల్లి, వాల్మీకిపురం, వీరబల్లి మండలాలు తీవ్రమైన కరువు బారిన పడిన సంగతి తెలిసిందే. కరువు పీడిన ప్రజానీకాన్ని ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి వినతులు వెల్లువెత్తిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపశమన చర్యలకు దిగింది. కేంద్రాన్ని పలుమార్లు సంప్రదించడంతో 50 రోజుల అదనపు పనిదినాలకు ఆర్థిక సంవత్సరం ముగింపు ముంగిట ఆలస్యంగా ఆమోదం తెలపడం గమనార్హం.

5,067 మందికే..

జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల పరిధిలో 9,467 మంది కూలీలు 100 రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నారు. వీరిలో కరువు బారిన పడిన 19 మండలాల్లో 5,607 మంది మాత్రమే 100 రోజులు పనిదినాలను పూర్తి చేసుకున్నారు. కేంద్ర నిబంధనల మేరకు 5,607 మందికి మాత్రమే అదనంగా 50 రోజుల పాటు ఉపాధి పనులు కల్పించనుంది. జిల్లాలోని కరువు మండలాల ఉపాధి పనుల సగటును పరిశీలిస్తే గరిష్టంగా 53 శాతానికి దాటిన సందర్భాలు లేకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా దట్టంగా అలుముకున్న కరువు మేఘాల నేపథ్యంలో సాంకేతికంగా ఎంపిక 19 కరువు మండలాలకే అదనపు ఉపాధి పనులకు పరిమితం కావడంపై ఆందోళన నెలకొంది.

50 కాదు..42 రోజులే!

2024-25 ఆర్థిక సంవత్సరం చివరి మాసమైన మార్చి నాటికి 43 రోజులే మిగిలి ఉన్నాయి. 50 రోజుల పనిదినాల కల్పన పేరుతో 42 రోజులే మిగిలి ఉండడంపై సందేహం నెలకొంది. 19 కరువు మండలాల పరిధిలోని 5,067 మంది 100 రోజులు ఉపాధి పనులు పూర్తి చేసుకున్న కూలీల్లో అదనపు పనిదినాల కల్పనలో భాగమైన మొదటి రోజైన 2,401 మంది ఉపాధి కూలీ పనులకు హాజరైనట్లు ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం పేర్కొనడం గమనార్హం.





రామాపురం, రాజంపేట మండలాల్లో చేపడుతున్న ఉపాధి పనులు (ఫైల్‌ఫోటో)

ఆశాలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆశా యూనియన్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు 2019లో అప్పటికి ఇస్తున్న అన్ని అలవెన్సులు కలిపి రూ.10 వేలు వేతనంగా నిర్ణయించారని, అప్పటి నుండి ఇప్పటి వరకు నిత్యావసర ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పైసా పెంచలేదన్నారు. ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు చేయాల్సిన పనులు కూడా ఆశా కార్యకర్తల చేత చేపించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల సందర్భంగా ఆశాలకు విధులు కేటాయించడం వేధింపుల్లో భాగమేనని పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద 20 ఏళ్లుగా పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జయమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్స్ తో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారే తప్ప కనీస వేతనం చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిభారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ రికార్డు పనిని ఒకసారి మాత్రమే చేయించాలని తెలిపారు. ఆశాలకు రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. మరణించిన ఆశా కుటుంబంలో అర్హులైనవారిని ఆశాలుగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎఎన్‌ఎం హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలన్నారు. ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమామణి, హారిక, గాయత్రి, మంజుల, మల్లేశ్వరి, పుణ్యవతి, సుజాత, పార్వతి, కిరణ్మయి, రమణమ్మ, గీత తదితరులతో పాటు డివిజన్ పరిధిలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

'మిషన్ వాత్సల్య'ను కట్టుదిట్టంగా అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని, పిల్లల సంక్షేమమే ధ్యేయంగా కట్టుదిట్టంగా అమలు చేయాలని, జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన, మిషన్ వాత్సల్య కార్యక్రమంపై జిల్లా స్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి సమావేశాన్ని ప్రారంభించారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి శిశు సంక్షేమం, పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. గ్రామ, వార్డు స్థాయిలలో సర్పంచ్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. కమిటీ జిల్లా, గ్రామస్థాయిలలో తప్పిపోయిన బాలలు పాఠశాల మానేసిన పిల్లలు, అక్రమ రవాణా బాధితులు, వలస వచ్చిన, అనాథ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి శ్రేయస్సు కోసం తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ వాత్సల్యాను కట్టుదిట్టంగా అమలు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అది సాధ్యమవుతుంది అన్నారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో ముఖ్యంగా అనాథ పిల్లలు, ప్రత్యేక రక్షణ కావాల్సిన పిల్లలు, నేరాల బారిన పడిన పిల్లలు, తదితరులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని ఎన్‌జిఒలు, సివిల్ సొసైటీలతో సమన్వయం చేసుకొని మిషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపేందుకు పోలీస్ శాఖ, విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖల వారు సమన్వయంతో పనిచేయాలన్నారు. వచ్చే బుధవారంలోగా జిల్లాలోని అనాథ పిల్లలు అందరిని మ్యాప్ చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. 1098 ద్వారా బాల్య వివాహాలపై వచ్చే ఫోన్ కాల్స్‌ను అప్రమత్తతతో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాజంపేట అడిషనల్ ఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మదనపల్లె బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, జిఎస్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్య, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

22న ప్రజ్ఞా వికాస పరీక్ష : యుటిఎఫ్



ప్రజ్ఞా వికాస పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22వ తేదీన ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు సుధాకర్, గాలి రవీంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ తెలిపారు. మంగళవారం జడ్‌పి పాఠశాలలో ప్రజ్ఞా వికాస పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలపైనే అనునిత్యం పోరాడటమే కాకుండా ఇలాంటి ప్రజ్ఞా వికాస పరీక్షను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజ్ఞా వికాస పరీక్షను రాసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పదో తరగతి పరీక్షలకు తెలుగు, హిందీ ఇంగ్లీష్, సైన్స్ మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులన్నిటికీ కలిపి ఒక్క మార్కు ప్రశ్నలు 100 ఇస్తామన్నారు. మార్చి 15 నుండి జరిగే పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ ప్రజ్ఞా వికాస పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజ్ఞా వికాస పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల్లో చురుకుదనం పెరగుతుందని, విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశమని తెలిపారు. ప్రజ్ఞా వికాస పరీక్ష రాయాలనుకునే పదవ తరగతి విద్యార్థులు రిజిస్ట్రేషన్, పూర్తి సమాచారం కోసం 9010627332, 9390181240, 7396952402 నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు జయబాబు, యుటిఎఫ్ నాయకులు బాబ్జాన్, రెడ్డి ప్రసాద్, భారతి, సరళాదేవి, విజయ, రెడ్డమ్మ పాల్గొన్నారు.



నల్లారికి వినతిపత్రం అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి -వాల్మీకిపురం

రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వాల్మీకిపురం మహర్షి వాల్మీకి సేవా సమితీ అధ్యక్షులు విష్ణు చైతన్య మంగళవారం కలికిరిలో ఉమ్మడి రాష్ట్ర మాజీ సిఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వాల్మీకుల పరిస్థితిని గమనించి, వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. దీనిపై స్పందించి మాజీ సిఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వాల్మీకులకు న్యాయం జరిగేలా, వాల్మీకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు గంగులప్ప, రామక్రిష్ణ, రాజేంద్ర ప్రసాద్, బాలు, భరత్, నరసింహులు, శంకర, రాజు, సదా, సాయి, శివ, అనిల్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -వాల్మీకిపురం

స్థానిక తరిగొండ రోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 6వ తేదిలోపు https://apbragcet.apcfss.in నందు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఏప్రిల్ 6వ తేదిన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వేసవి కారణంగా గ్రామాల్లో తాగునీరు సమస్యలు అధికంగా ఉంటాయని, ముందుస్తుగా చర్యలు చేపడుతున్నామని, నూతనంగా తాగునీరు బోర్లు వేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల గురించి అధికారులతో చర్చించామని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తు చేసుకున్నారని, కండక్టర్ కొరత ఉండడంతో అధికారులతో మాట్లాడామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. రెవెన్యూ సదస్సులు జరిగినప్పటికీ ఇంకా ప్రజల ఎక్కువగా భూ సమస్యల మీద అర్జీలు ఇస్తున్నారని, వాటిని కూడా పరిశీలించి పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు.

పిజిఆర్‌ఎస్ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-టి.సుండుపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్), రెవెన్యూ సదస్సులో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై నిర్లక్ష్యం వీడి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తహాశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్, రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారం ప్రగతిపై తహాశీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్‌ఒ, విఆర్‌ఎలతో సమీక్షించారు. భూమి సమస్యలపై సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, పెండింగ్లో ఉన్నవి ఎన్ని అని తహాశీల్దార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా మండలంలో భూమి సమస్యలపై 506 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహాశీల్దార్ దైవాదీనం కలెక్టరుకు వివరించారు. గ్రామాలలో అంశాల వారీగా అర్జీలు పెండింగ్ ఉండడానికి గల కారణాలను విఆర్‌ఒ, విఆర్‌ఎలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హత మేరకు వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపకుండా ప్రగతిలో వెనకబడిన తిమ్మసముద్రం, జి.రెడ్డిగారిపల్లి, ముడుంపల్లి, బాగంపల్లి విఆర్‌ఒ, విఆర్‌ఎలకు షోకాస్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. మూడు రోజులు లోపల ప్రగతి చూపకపోతే తప్పనిసరిగా శాఖా పరంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం మన అందరి బాధ్యత. ఈ సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలి. ఇంకను పెండింగ్ ఉన్న వాటిని అంశం వారీగా ఎస్‌ఎల్‌ఏ పరిధిలోగా పరిష్కరించాలని సూచించారు. వచ్చిన అర్జీలలో మ్యూటేషన్స్, అసైన్మెంట్, ఆర్‌ఒఆర్, భూసేకరణ, దారి సమస్యలు, ఫౌతి కేసులు, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, డిస్ప్యూట్స్, సివిల్ కేసులు తదితరాలను సమీక్షించి తీసుకోవల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయికి వెళ్తే భూసేకరణ, దారి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. 3 రోజుల్లో దారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. అర్హులకు ఖచ్చితంగా న్యాయం జరగాలి. అర్జీల పరిష్కారంలో నాణ్యత, వేగం రెండూ ముఖ్యం. పరిష్కరించలేని అర్జీలకు వాస్తవ కారణాలతో స్పష్టమైన నివేదిక రూపొందించి అర్జీలను పరిష్కరించాలని చెప్పారు. మండలంలో ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు వాటికి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. అనంతరం సుండుపల్లె-3 పరిధిలో యర్రగుట్ట ప్రాంతంలో స్మశాన వాటిక ఏర్పాటు నిమిత్తం క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. స్మశాన వాటికకు భూమి కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నట్లు తహశీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు అక్కడ 1.18 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నట్టు తహశీల్దార్ వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ గ్రామస్తుల సౌకర్యార్థం అదే ప్రాంతంలో స్మశాన వాటిక నిమిత్తం భూమి కేటాయింపునకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే ఆ ప్రాంతంలో మట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు దృష్టికి వచ్చిందని.. అలాంటి వారిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని కూడా తాసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఏ లు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాజీ వైస్ ఛాన్సలర్ శ్రీకాంత్‌రెడ్డి

వ్యక్తిత్వ వికాసంపై 'మిట్స్' విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (మిట్స్) కళాశాలలో భవిష్యత్ నాయకుల కోసం వ్యక్తిత్వ వికాసం వృత్తి పరమైన, వ్యక్తిగత వృద్ధికి మానసిక అంతర్దృష్టులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ మరియు మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృత్తిపరమైన మరియు వ్యక్తిగత వృద్ధికి కీలకమైన విలువైన మానసిక అంతర్దృష్టులతో విద్యార్థులను సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల వృద్ధిని పెంపొందించడానికి సాంకేతిక నైపుణ్యాన్ని బలమైన వ్యక్తిగత లక్షణాలతో అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు వివరించారు. నేటి వేగవంతమైన, పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసం భవిష్యత్ నాయకులను రూపొందించడంలో కీలకమైన అంశంఅని, నాయకత్వం అనేది సాంకేతిక జ్ఞానం లేదా నైపుణ్యం గురించి మాత్రమే కాదు, ఇది స్వీయ-అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు మరియు ఇతరులను ప్రేరేపించే సామర్థ్యం గురించి ఉంటుందని ఆయన అన్నారు. ఆత్మవిశ్వాసం, భావోద్వేగ మేధస్సు, ప్రభావవంతమైన కమ్యూనికేషన్, అనుకూలత, నిర్ణయ నైపుణ్యాలు వంటివి విద్యార్థులకు చాలా ముఖ్యమన్నారు. ఒక గొప్ప నాయకుడు ఎల్లప్పుడూ స్వీయ-అవగాహన కలిగి ఉంటాడు. క్రమం తప్పకుండా స్వీయ-ప్రతిబింబం బలాలు మరియు మెరుగుదల కోసం ప్రాంతాలను గుర్తించడంలో సహాయపడుతుంది అని అన్నారు. కార్యక్రమం లో డాక్టర్ పి.రామనాథన్, డీన్ శ్రీమంత బసు, డీన్ తులసీరామ్ నాయుడు, దస్తగిరి బాషా పాల్గొన్నారు.



ఆలయం వద్ద దేవాదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు

వేలం పాట వాయిదా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహా శివరాత్రి సందర్భంగా శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద టోల్‌గేట్ వసూలు, తాత్కాలిక దుకాణాల నిర్వహణకు నిర్వహించదలచిన బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. మంగళవారం వారు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ మేషరామకృష్ణ, గోపాలకృష్ణ, అర్చకులు శంకర శాస్త్రిలతో కలసి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇఒ మాటాడుతూ తవళం గ్రామంలోని శ్రీ నేలమల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలను ఈ సంవత్సరం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయం గర్భగుడి నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన ప్రాంగణం పునర్నిర్మాణ దశలో ఉందన్నారు. ఆలయ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, నిధుల సమీకరణలో భాగంగా మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు ఆలయం వద్ద వాహనాల టోల్ గేట్ వసూళ్ల చేసుకొనుటకు, తాత్కాలిక దుకాణాలను నిర్వహించుకొనుటకు మంగళవారం బహిరంగ వేలాన్ని నిర్వహించాలనుకున్నామని అన్నారు. పాటాదారులు పూర్తిస్థాయిలో పాల్గొనక పోవడంతో వేలాన్ని వాయిదా వేశామన్నారు. త్వరలోనే వేలంపాటను నిర్వహించే తేదీని ప్రకటిస్తామని చెప్పారు. అటెండర్ మహేష్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-కలకడ

వివిధ కార్పొరేషన్ల రుణాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగు తుందని ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన బిసి, ఇడబ్ల్యూఎస్, కాపు కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఉదయం 10.30 గంట లకు దరఖాస్తు దారులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరాఉ. అన్ని బ్యాంకుల ప్రతినిధుల హాజరవుతారని, కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులు, ఒరి జినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు.



టార్పాలిన్ పట్టలను అందిస్తున్న హారితమ్మ

టార్పాలిన్ పట్టలు పంపిణీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని పడమటి కోన గ్రామం బోరెడ్డిగారిపల్లి సచివాలయం దగ్గర వెలుగు పథకం ద్వారా మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘ సభ్యులకు మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ చేతుల మీదుగా టార్పాలిన్ పట్టలు పంపిణీ పంపిణీ చేశారు. 102 పట్టలు మంజూరు కాగా 30 మంది రైతులకు పట్టలను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ గాలి, వర్షం, సూర్యకాంతి నుండి పంటలను రక్షించడానికి టార్పాలిన్లను అనేక విధాలుగా ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు ఈ పట్టలను సద్వినియోగం చేసుకొని పండించిన ధాన్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం రెడ్డమ్మ, సిసిఎం అంజలి, వెంకటలక్ష్మి, నాగరాజు, సుధామణి, విఎఒలు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

రుణాల ఇంటర్వ్యూలకు 400 మంది హాజరు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామాల పంచాయతీ నుంచి 500 మంది బిసి రుణాలకు దరఖాస్తు చేసుకోగా 400 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపిడిఒ జాషువా తెలిపారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ మండల వ్యాప్తంగా బిసి, కాపు సబ్సిడీ రుణాలకు 40యూనిట్లు మంజూర య్యాయని అందులో 10 యూనిట్లు కాపులకు, 30 యూనిట్లు బిసిలకు ఎంపిడిఒ కార్యాలయంలో ఇంట ర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఎపిజిబి, ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు ఆధ్వర్యంలో ఇంట ర్వ్యూలు చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీరుణాలు మంజూరు చేస్తామని ఆయా బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయమని తహశీల్దార్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని రావులకొలను గ్రామంలో మంగళవారం ఆయన విలేజ్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి పలు అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ విలేజ్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రాస్ రూట్ స్టేక్ హోల్డర్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్‌నాయక్, న్యాయవాది కిరణ్‌కుమార్, రెడ్స్ సంస్థ ట్రైనర్ ఎల్లప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, బాలికలపై జరిగే అఘాయిత్యాల గురించి నేటి సమాజంలో జరుగుతున్న అక్రమాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పేదరికంతో వున్నవారు, ఆర్థికంగా వెనుకబడిన వారు, ఒంటరి మహిళలు, వికలాంగులను గుర్తించి వీరికి మాయమాటలు చెప్పి పెద్ద నగరాలలోని వ్యభిచార గృహాలకు తరలించి అమ్మేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ఇలాంటివి జరగకుండా స్టేక్ హోల్డర్స్ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ఆడపిల్లలని బాగా చదివించి వారి భవిష్యత్తును మంచిగా తీర్చి దిద్దాలని, సరైన వయస్సులోనే వివాహం చేయాలని అన్నారు. సురక్ష గ్రామ కార్యక్రమంలో భాగంగా సేఫ్ విలేజ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసి గ్రామంలో రక్షక్ గ్రామ మిత్ర గ్రామ పెద్ద నోడల్ టీచర్సను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీనివాసులు

'పది'లో వంద శాతం ఫలితాలు సాధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-రామాపురం

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 10వ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని ఎఎస్‌డబ్ల్యూఒ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను, భోజనశాల, వంటగది, విద్యార్థుల డార్మేంట్ రూములను పరిశీలించారు. మెనూ బోర్డులను పరిశీలించి మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని వార్డెన్ అనుపమను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అనుకూలంగా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం పిల్లలతో భోజనాలు ఎలా ఉన్నాయి, వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఐసి ఫైనల్స్‌కు 'గొబ్బిళ్ల అక్షర' విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు

జాతీయస్థాయిలో ప్రతి ఏటా జరిగే ప్రతిష్టాత్మక నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎన్ ఎస్ఐసి)2025, సీజన్-8 కాంపిటీషన్‌లో తమ పాఠశాల విద్యార్థులు ఎన్.లక్ష్మీచైతన్య, ఎస్.జైనాబ్ ఎంపికైనట్లు గొబ్బిళ్ల అక్షర స్కూల్ కరస్పాండెంట్ శ్రీనాథ్ త్రినాథ్, శ్రీనాథ్ తెలిపారు. వరుసగా రెండో సారి ఫైనల్స్‌కు ఎంపికై 20న బెంగళూరులో జరగనున్న ఫైనల్స్‌లో పాల్గొంటారని తెలిపారు. గత యేడాది బెంగళూరులో జరిగిన ఫైనల్ కాంపిటీషన్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ పొంది మొదటి ర్యాంక్‌ని సాధించారని తెలిపారు. దీనికి కృషి చేసిన విద్యార్థుల మెంటర్ వరప్రసాద్‌ను యాజమాన్యం అభినందించారు. గత యేడాది మాదిరిగానే ఈ సారి కూడా తమ విద్యార్థులు ఎన్ఎస్ఐసి ఫేస్-2లో అద్భుతమైన ప్రతిభను కనబరిచి జడ్జీలను అబ్బురపరిచి ఫైనల్‌కు చేరుకున్నారని అన్నారు. ఇదిమండలం లోని ప్రతీ ఒక్కరూ గర్వించ దగ్గ విషయమని తెలిపారు. విద్యార్థులలోని ప్రతిభని గుర్తించి సరైన ఆధునిక పద్దతులలో నైపుణ్యాలను జోడిస్తే గ్రామస్థాయి పిల్లలు కూడా జాతీయ స్థాయిలో ఎన్నో అద్భుతాలను సాధించగలరని తెలిపారు.



ఎన్ఎస్ఐసి ఫైనల్స్‌కు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపల్

వైసిపి నాయకులకు సన్మానం



ఆనంద్, కేశవరెడ్డిలను సన్మానిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-రామసముద్రం

మదనపల్లి నియోజకవర్గ వైసిపి బిసి సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన దొడ్డిపల్లి ఆనంద్, రామసముద్రం వైసిపి మండల అధ్యక్షులుగా ఎన్నికైన పి. కేశవరెడ్డిలను మంగళవారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు బాణసంచా నడుమ కేక్‌కట్ చేసి పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కుసుమకుమారి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, సీనియర్ నాయకులు జయరాం రెడ్డి, సి.హెచ్ ప్రకాష్, రాధరెడ్డి, విజయరెడ్డి, అంబరీష్, కేశవ, బసప్ప, సర్పంచ్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను మెరుగు పరచాలి : డిప్యూటీ డిఇఒ



రామాపురం: మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు పూర్వ ప్రాథమికలో పునాది అభ్యసనం మెరుగు పరచాలని డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నీలకంఠరావుపేట జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా జ్ఞాన జ్యోతి 120 శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతం మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఆరు రోజులు పాటు నిర్వహిస్తారని ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు మూడు సంవత్సరాల చిన్న పిల్లలు వస్తుంటారని వారికి పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడీ కేంద్రాల నుంచే అందించాలని అన్నారు. పిల్లల పునాది అభ్యసనం మెరుగుపరచడానికి విద్యార్థులను బలోపేతం చేయడానికి వారి సమగ్రాభివృద్ధికి ఈ శిక్షణ తరగతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు, డిఆర్‌పిలు కుమార్‌స్వామి, వెంకటసుబ్బయ్య, పార్థసారథి, లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మావతి, సూపవర్‌వైజర్ సుజాతరెడ్డి, హుస్సేనమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు: పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో మానసిక ఆనందాన్ని అందించే విద్యను ప్రోత్సహిం చాలని పీలేరు మండల విద్యాశాఖ అధికారి వై. లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ ప్రోగ్రాంను జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా పీలేరు మండల అంగన్వాడీ కార్యకర్తలకు మొదటి విడతగా ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో మానసిక ఆనందాన్ని అందించే విద్యను ప్రోత్సహించడం కోసం విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందించాలన్నారు. ముందుగా విద్యార్థులకు ఆటపాటలతో ఆనందాన్ని నింపాలని ఇందుకోసం కార్యకర్తలు ఈ ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో అనేక రకాల బోధనా పద్ధతులను నేర్చుకోవాలని, కోర్సు ఆవశ్యకతను, పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ విజి నటరాజన్, పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ రాజమ్మ, సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, ఉమ, అక్కయ్య, రీసోర్స్ పర్సన్స్‌గా ఉపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, సురేష్ బాబు, రేఖ, సి.ఆర్.పి జలకనూరు మురళీధర్ రాజు పాల్గొన్నారు.



పీలేరు : మాట్లాడుతున్న ఎంఇఒలోకేశ్వర్‌రెడ్డి

అర్జీదారులకు కోరిన సమాచారాన్ని ఇవ్వాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమాచార హక్కు చట్టం-2005 ద్వారా ప్రజలు కోరే సమాచారాన్ని అర్జీదారులకు సంబం ధిత అధికారులు అందించాలని రాజంపేట పురపాలక సంఘం పౌర సమాచార అధికారి సూర్య మోహన్ తెలిపారు. మంగళవారం రాజంపేట పట్టణంలోని ఉస్మా నగర్ 1,2, అమ్మవారిశాలవీధి, ఈడిగ పాలెం పరిధిలోని ప్రజలకు సమాచార చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.సూర్య మోహన్ మాట్లాడుతూ అర్జీదారులు కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారులు స్పష్టంగా ఇవ్వాలని కోరారు. అర్జీ దారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారికి సకాలంలో ఇవ్వాలని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : విభిన్న ప్రతిభావంతులకు, వయోవ ృద్ధుల సంక్షేమశాఖ వారి సహకారంతో పట్టణంలోని అమ్మచెర ువుమిట్టలో గల వెలుగు సంస్థ సెక్రటరీ యం.ఉదయ్ మోహన్‌రెడ్డి వినికిడి యంత్రాలు, వీల్ చైర్‌ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కృష్ణనగర్‌లో నివాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఇ.నగేష్‌బాబు, ఇ.పురుషోత్తంలకు వినికిడి యంత్రాలను అందించామని చెప్పారు. పట్టణంలోని గౌసియా స్ట్రీట్‌లో నివాసముంటున్న విభిన్న ప్రతిభావంతుడు ఎస్.మొహమ్మద్ జైన్ అనే అబ్బాయికి, గుట్టపాలెంకు చెందిన జి.అమరనాథ్ కుమార్తె గిట్ట గ్రీష్మప్రియకు వీల్ చైర్లను అందించినట్లు తెలిపారు. పిటిఎం మండలం, ఉప్పరవాండ్లలో నివాస ముంటున్న బధిరుడు జి.దివాకరకి వినికిడి యంత్రాన్ని అందజేసామన్నారు. సేవ దృక్పథంతో ఈ ఉపకరణాలను అందించిన వెలుగు సెక్రటరీకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



విభిన్న ప్రతిభావంతురాలికి ట్రైసైకిల్‌ను అందిస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి



నిత్యావసర సరుకులు అందించిన సతీష్‌కు అభివాదం తెలుపుతున్న వృద్ధులు

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు రూ. లక్ష 5వేల రూపాయలు విలువచేసే నిత్యావసర సరుకులను ఆశ్రమ పిల్లల కోసం మంగళవారం సందీప్ సూపర్ మార్కెట్ యజమాని సతీష్ వితరణ చేశారు. ఈ సందర్భంగా సతీష్, కుమారుడు సందీప్ మాట్లాడుతూ 98 మంది పిల్లలు, పదిమంది వ ృద్ధులను చేరదీసి వారి ఆలనా పాలనా చూసుకుంటూ విద్యా, వైద్యం, వసతి అందిస్తున్న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ కృషి అభిందనీయన్నారు. ఈసందర్భంగా సతీష్ కుటుంబ సభ్యులు యజ్ఞశ్రీ సతీష్, హన్విక, వైష్ణవి, ఉషశ్రీ సందీప్ లకు సంస్థ జనరల్ సెక్రెటరీ కవిత రాణి, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్ బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపి ఆనందన్ శాలువతో సత్కరించి, సంస్థ జ్ఞాపికను అందించారు. మేము చేస్తున్న ఈ మహా యజ్ఞంలో మాకు తోడుగా, నీడగా మా వెన్నంటే ఉంటూ మమ్మల్ని ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్న విధాతల్లాంటి దాతలకు క ృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద వృద్ధాశ్రమ సిబ్బంది, పిల్లలు, కో-ఆర్డినేటర్ భార్గవి పాల్గొన్నారు.

సిసి రోడ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం మడితాడు గ్రామపంచాయతీలోని భయనేనివారిపల్లిలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన పెదవేటి చిన్నప్ప, గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ గ్రామంలో 20 నివాస గృహాలు ఉన్నాయని సిమెంటు రోడ్డు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షం వచ్చిందంటే రోడ్డుపై గుంతల్లో నీళ్ల నిలుస్తాయని రాక పోకలకు కష్టతరంగా ఉందని అన్నారు. నడివేది నుంచి పెదవేటి చిన్నప్ప ఇంటి వరకు 500 మీటర్లు ఉంటుందని అన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. 15 సచివాలయాల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో 340 చేతి పంపులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 240 చేతి పంపులను ప్రజలు అధికంగా వినియోగిస్తున్నారు. వీటికి మరమ్మతుల చేపట్టేందుకు అవసరమైన సామగ్రి ఎంపిడిఒ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. వేసవిలో సమస్య ఉత్పన్నమైతే వెంటనే చర్యలు తీసుకోనున్నారు. గతంలో వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటికి కటకట ఏర్పడినప్పటికీ.. మండల పరిధిలో చేతి పం పులు అధికంగా ఉండడంతో చాలా వరకు నీటి సమస్య తలెత్తకుండా బయట పడ్డారు. ఒకటి రెండు గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో వేసవిలో సమస్య ఏర్పడలేదు. చియ్యపాడు గ్రామంలో అధిక నీటి సమస్య ఏర్పడడంతో పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. ఎంపిడిఒ కార్యాలయంలో చేతిపంపులకు సంబంధించిన సామగ్రి అందుబాటులో ఉంచడంతో నీటి సమస్య లేకుండా ఉంది.

క్రైం కార్నర్



జైలుశిక్ష పడిన నిందితులతో పోలీసులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్ష

ప్రజాశక్తి-కలకడ

డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రామాం జనేయులు తెలిపారు. గతంలో మండలంలో వాహనాలను తని ఖీల్లో భాగంగా సీతంపేటకు చెందిన ఎస్.మహమ్మద్, బాలయ్యాగారిపల్లి పంచాయతీ కొత్త వడ్డి పల్లికి చెందిన ఎం.సురేంద్ర, దేవలంపేటకు చెందిన ఎస్.సాదిక్, తిమ్మాపురం వడ్డిపల్లికి చెందిన ఎం.కిరణ్‌కుమార్, బాటవారిపల్లెకు చెందిన సి.శ్రీను అనే ఐదుగురు డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడటంతో కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. మంగళవారం వాల్మీకిపురం జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మెజి స్ట్రేట్ గురు అరవింద పూర్వా పరాలు విచారించి, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.11వేలు వంతున రూ.55వేలు జరిమానా విధించి, వారం రోజులు పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో కోర్టు కాని స్టేబుల్ ముత్యాలు యునెస్ ఇమ్రాన్ మహబూబ్‌బాషా, హోంగార్డు గిరి పాల్గొన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కాండ్లమడుగు క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళ్తే పుంగనూరు నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న టాటా పికప్ టమోటా వాహనం కదిరి వైపు నుంచి వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో టమోటా వాహనంలో ఉన్న రైతు శరత్ ,డ్రైవర్ శివశంకర్‌కు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి..

రామాపురం : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైక్‌లు ఢీకొని వెంక ట సుబ్బరాయుడు, బండి వెంకట సుబ్బరాయుడు, శ్రీనివాసులు అనే ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్క్మి వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మండలం ఓబుల్‌రెడ్డి గారిపల్లెకు వీరు కూలి పని కోసం జగనన్న కాలనీకి బైక్‌పై వెళుతుండగా మార్గ మధ్యంలో బండపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపానికి రాగానే వెనుక వైపు నుంచి కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న కడపకు చెందిన మౌ లాలి బైక్ ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ సంఘటనలో ముందు వెళ్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామపురం పోలీస్ చేరుకొని గాయ పడిన వారిని ప్రథమ చికిత్స కోసం రాయచోటి ఆస్పత్రికి తర లిం చినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన మదనపల్లె యువకుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. మదనపల్లె ఆర్‌ఆర్ వీధిలో ఉండే షాన్ వాజ్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని అక్కడ ఉన్న నిరుద్యోగుల వద్ద డబ్బు తీసుకున్నాడని తెలిపారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేసి, అక్కడి నుంచి పరారై స్వగ్రామం మదనపల్లె కు చేరుకున్నాడని అన్నారు. బాధితులు హైదరాబాద్ లోని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మదనపల్లెకు చేరుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.